క్లుప్తంగా

బ్లీచింగ్ చల్లేందుకు కూడా డబ్బులు లేవు


విలేకర్లతో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

బుట్టాయగూడెం: గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడం వల్ల పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ చల్లేందుకు కూడా డబ్బులు లేక అవస్థలు పడుతున్నామని సర్పంచ్‌లు తెల్లం రాముడు, కుంజా వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్‌లు, సర్ చార్జీలు విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ వెట్రిసెల్వికి సర్పంచ్‌ల బృందం వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 6 నెలలుగా రాకపోవడం వల్ల గ్రామ పంచాయతీల్లో బోర్ల మరమ్మతులు చేయించాలన్నా, కాల్వ పూడిక పనులు, జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య పనులు చేయించేందుకు అనేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, ఉయికే బొజ్జి, పొడియం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జీవో 36 ప్రకారం స్వీపర్లకు జీతాలు చెల్లించాలి


నగర పంచాయతీ కమిషనర్ రాంబాబుకు సమ్మె నోటీసు అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

చింతలపూడి: మునిసిపాలిటీ స్వీపర్లకు 36 జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని సోమవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సంయుక్తంగా చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ ఎ రాంబాబుకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు తుర్లపాటి బాబు, సీఐటియు జిల్లా కమిటీ సభ్యుడు నత్త వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీగా మార్పు చెందిన దగ్గర నుంచి నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీవోల ప్రకారం జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. దీంతోగ పారిశుధ్య కార్మికులు నగర పంచాయతీకి సమ్మె నోటీస్ అందజేయడం జరిగిందన్నారు. నెలకు రూ.21 వేలు ఇవ్వవలసి ఉండగా రూ.15 వేలు మాత్రమే చెల్లించటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పారిశుధ్య కార్మికులు వెలగాడి అనురాధ, కమల కుమారి, పద్మ, బాలు తదితరులు తమ ఆవేదన వెలిబుచ్చారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె


అమ్మవార్లకు సారె తీసుకువెళ్తున్న మహిళా భక్తులు

బుట్టాయగూడెం: ఆషాఢమాసం పురస్కరించుకుని స్థానిక మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి(త్రిశక్తిపీఠం) అమ్మవార్లకు సోమవారం భక్తులు సారెను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కజ్జికాయలు, గోరుమిట్టీలు, కాజాలు, పాలకోవా, లడ్డూ, జాంగ్రీ, చలిమిడి, పంచదార చిలకలు, మైసూర్‌పాక్, పాపిడి, పసుపు కుంకుమ, పువ్వులు, గాజులు, చీర, జాకెట్టు, పండ్లు, కరివేపాకు, తులసి దళాలతో మహిళలు ఊరేగింపుగా ఆలయాలనికి తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ


సారె సమర్పిస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి సోమవారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. బాలదుర్గా లలితాపారాయణ మండలి వారిచే వివిధ రకాల నైవేద్యాలు, పసుపు, కుంకుమలతో కూడిన సారెను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.

ఇష్టానుసారంగా తవ్వేసిన చెరువును సరిచేయాలి

ఏలూరు (టూటౌన్): ఇష్టానుసారంగా తవ్వేసిన రజకుల చెరువును సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీ నర్సాపురానికి చెందిన బీకేఎంయూ కార్యదర్శి తాడిగడప జయరాజు కలెక్టర్‌ను కోరారు. టీ నర్సాపురం సమీపంలో ఉన్న రజకుల చెరువును 15 అడుగుల లోతులో గ్రీన్ ఫీల్డ్ హైవే వారు తవ్వినట్లు ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు. ఆ చెరువులో మద్యం సీసాలు, గాజు పెంకులు చెత్తా చెదారం గ్రామస్తులు వేయడం వల్ల రజకులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. రజకులకు, ప్రజలకు, పశువులకు చెరువులో నీళ్లు ఉన్నప్పుడు దిగితే ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని, దీనిపై గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని జయరాజు కలెక్టర్‌కు వివరించారు.

ఉపాధి లేదు.. పరిహారం అందదు

- కాంటూర్‌లతో కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం
- ఉపాధి లేక అవస్థలు పడుతున్న నిర్వాసిత కూలీలు
- పనుల కోసం నిత్యం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన
- ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్


పరిహారం ఇచ్చిన భూముల్లో జామాయిల్ సాగు చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: పాలకుల పాపం నిర్వాసితుల పాలిట శాపంలా తయారైంది. పోలవరం ప్రాజెక్ట్ పరిహారం ఇవ్వక, ఇటు పనుల్లేక ఉపాధి కోసం పొట్టచేత పట్టుకుని నిర్వాసితులు పక్క రాష్ట్రాలకు వలస బాట పడుతున్నారు. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్ట్ పేరుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. విలీనం అనంతరం అప్పటి ప్రభుత్వం 2016–2017వ సంవత్సరంలో భూసేకరణ చేపట్టి పరిహారం చెల్లించింది. కానీ ఆర్‌అండ్‌ఆర్ పరిహారం మాత్రం చెల్లించలేదు, 2019 కల్లా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించి పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్న అప్పటి ప్రభుత్వ పెద్దల మాటలతో మండలంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అప్పటికే ముంపు పేరుతో అరకొరగా జరుగుతున్న నిర్మాణ రంగ పనులు పూర్తిగా మందగించాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక పస్తులుండే పరిస్థితి ఏర్పడింది. ఇలా దిక్కుతోచని స్థితిలో భవన నిర్మాణ కార్మికులు వలస బాట పట్టారు.

జాబితాలో పేర్లు తొలగిస్తారన్న భయం

ఉపాధి కోసం నిర్వాసితులు నిత్యం కుక్కునూరు నుంచి తెలంగాణ ప్రాంతంలోని భద్రాచలం, అశ్వారావుపేట, పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఉపాధి కోసం రాకపోకలు సాగిస్తున్న నిర్మాణ రంగ కూలీలు తప్పకుండా కుక్కునూరులోనే ఉండాల్సిన పరిస్థితి.. లేదంటే గతంలో అలా పనులకు వెళ్లిన వారి పేర్లను స్థానికంగా ఉండడంలేదన్న సాకుతో ఆర్‌అండ్‌ఆర్ జాబితా నుంచి తొలగించినట్టే తమ పేర్లు తొలగిస్తారన్న భయం నిర్వాసితులను వెంటాడుతోంది. మరో పక్క భూములకు పరిహారం చెల్లించడంతో పరిహారం పొందిన రైతులు ప్రభుత్వం సేకరించిన భూముల్లో పెద్దెత్తున జామాయిల్ సాగును ప్రారంభించారు. దీని కారణంగా రైతు కూలీలకు ఉపాధి గండం ఏర్పడింది. దీంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో భవన నిర్మాణ కూలీలు, రైతు కూలీలు అర్ధాకలితోనే దొరికిన పని చేసుకుంటూ బతుకునావను సాగిస్తున్నారు. ఇలా ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించకుండా 41 కాంటూర్, 45 కాంటూర్ అంటూ విడదీసి ఇంకా పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తోందే తప్ప నిర్వాసితుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా కాంటూర్‌లంటూ కాలయాపన లేకుండా ముంపునకు గురవుతున్న గ్రామాలన్నింటికీ పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

సగం కూలి డబ్బులు చార్జీలకే



కుక్కునూరు మండలంలో సిమెంట్ పనులు లేక నిత్యం అశ్వారావుపేట మండలం వినాయకపురం వెళ్లి పనులు చేస్తున్నాం. రోజూ వచ్చే కూలిలో సగం చార్జీలకే సరిపోతుంది. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడంతో ఉన్న ఊర్లో పనుల్లేక వేరే ఊర్లకి ఉపాధి కోసం వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి మాకు ఒక దారి చూపాలి.

– కె.హరి, భవన నిర్మాణ రంగ కార్మికుడు, కుక్కునూరు

మా కష్టాలు దేవుడికెరుక



ఉపాధి పనులు లేక రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఎంత ఇబ్బందో అనుభవించే మాకు మాత్రమే తెలుసు. నిత్యం పనికోసం ఎండా, వాన, చలిలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని దాదాపు 100 కి.మీ వెళ్లి రావాల్సి వస్తుంది. అలా వెళ్లి రావడానికి మేము పడుతున్న ఇబ్బందులు ఆ దేవుడికెరుక. ఇకనైనా ప్రభుత్వం మాకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– ఎస్డీ.బాలుషా, భవన నిర్మాణ రంగ కార్మికుడు, కుక్కునూరు

పనుల కోసం ఖమ్మం వెళ్తున్నాం



పోలవరం ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా.. అసలు ఇస్తారా లేదా అని తేల్చకపోవడంతో నిర్మాణ పనులు చేయాలా లేదా అని నిర్వాసితులు మీమాంసలో ఉన్నారు. దీంతో నిర్వాసిత మండలాల్లో పనుల్లేక 200 కి.మీ. దూరంలో ఉన్న ఖమ్మం వెళ్లి పనులు చేస్తున్నాం.

– షేక్ సలీం పాషా, భవన నిర్మాణ మేస్త్రి, కుక్కునూరు

ప్రభుత్వం ఉపాధి చూపించాలి



నిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం 41, 45 కాంటూర్‌లంటూ కాలయాపన చేస్తోంది. ఇక్కడి నిర్వాసితులు ముఖ్యంగా రైతు కూలీలు, భవన నిర్మాణ రంగ కూలీలు ఉపాధి కరువై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. లేదంటే నిర్వాసితులను తరలించే వరకు స్థానికంగా ఉపాధి చూపించాలి.

– యర్సం సాయికిరణ్, సీఐటీయూ కార్యదర్శి, కుక్కునూరు

పీఎం జన్మాన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


ఐటీడీఏలో అధికారులతో మాట్లాడుతున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో పీఎం జన్మాన్ పథకంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో పీఎం జన్మాన్ పనుల పురోగతిపై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు, భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే అప్‌గ్రేడ్ విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పీవీటీజీ కుటుంబాలకు మంచినీటి కుళాయిలు బిగించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో బుధవారం పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మాస శివరాత్రి పురస్కరించుకుని శివపార్వతుల పంచలోహ ఉత్సవ విగ్రహాలకు సన్నాయి మేళ తాళాల మధ్య పట్టణ ప్రధాన వీధుల్లో పల్లకీసేవ నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎక్సైజ్ నిందితుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా కుక్కునూరు మండలంలో సారా కేసులలో పరారీలో ఉన్న నిందితులు శ్రీధరవేలేరు గ్రామం నుంచి భూక్యా సూర్యం, జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం గ్రామానికి చెందిన మధ్యాహ్నపు ధర్మారావు, జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన కుక్కల రవిబాబు అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. వీరిని జంగారెడ్డిగూడెం కోర్టు నందు హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఎస్సై ఎస్‌ఎన్‌ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మాకు కేటాయించిన భూములకు హద్దులు చూపించాలి


నిర్వాసితుల ఆవేదన

బుట్టాయగూడెం: రామన్నగూడెం సమీపంలో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ గ్రామంలో నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని నిర్వాసితులు అందెల సీతారామిరెడ్డి, వేట్ల ముత్యాలరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న అల్లూరి జిల్లా తుమ్మిలేరు గ్రామానికి చెందిన తమను బుట్టాయగూడెం రామన్నగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి రెండేళ్ల క్రితం తరలించారని చెప్పారు. అయితే తమకు ప్రభుత్వం కేటాయించిన భూమి హద్దులు చూపించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి సర్వేయర్లను పంపి తమ భూముల హద్దులు చూపించాలని కోరారు.

మిథున్ రెడ్డి అరెస్ట్ అన్యాయం

కొయ్యలగూడెం: ఎంపీ పీవీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుకు రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం తప్పక బదులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుందని ఎంపీపీ గంజిమాల రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌లో మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం అన్యాయమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వీధికో బెల్ట్ షాపు ఏర్పాటుచేసి కూటమి ప్రభుత్వం మహిళల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ప్రతి వీధిలో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని, సందుకో సిట్టింగ్ రూమ్ కూటమి నాయకులు ఏర్పాటు చేశారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక సీఎం, డిప్యూటీ సీఎం ప్రజల దృష్టిని మరల్చేందుకు లేని లిక్కర్ స్కామును సృష్టించారని అన్నారు. సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు సైతం కూటమి ప్రభుత్వం వెనుకాడుతోందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ధైర్యంతో కూటమి అన్యాయాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

అరెస్టులతో భయపెట్టలేరు

టి.నరసాపురం: అరెస్టులతో వైఎస్సార్ సీపీ నాయకులను భయపెట్టలేరని టి.నరసాపురం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శ్రీనురాజు అన్నారు. మాజీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును ఆయన పలువురు నాయకులతో కలిసి సోమవారం ఖండించారు. కూటమి ప్రభుత్వం ఎంతటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నా వైఎస్సార్‌సీపీ నాయకులు తలొగ్గరని అన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టును ఖండించిన వారిలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, టి.నరసాపురం సహకార సంఘ మాజీ చైర్మన్‌లు దేవరపల్లి ముత్తయ్య, పిన్నమనేని చక్రవర్తి, నాయకులు బండి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

అప్రజాస్వామికం


నిమ్మ గురునాథరెడ్డి

జంగారెడ్డిగూడెం: ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును లక్కవరం వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మాని, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసులు, అరెస్టులు అంటూ దుశ్చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ చర్యలకు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతామన్నారు.

కూటమి ప్రభుత్వంలో తారాస్థాయికి కక్షసాధింపులు


జ్ఞానారెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు

చింతలపూడి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సీహెచ్ జ్ఞానారెడ్డి అన్నారు. సోమవారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు తారాస్థాయికి చేరాయన్నారు. అధికారంలోకి వచ్చాక పాలనపై దృష్టి పెట్టకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో జరిగిన మద్యం పాలసీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కూటమి కుట్రలు తిప్పికొడతామని పెద్దిరెడ్డి నిర్దోషిగా విడుదలవుతారని అన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం


బొడ్డు వెంకటేశ్వరరావు

చింతలపూడి: కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆ పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు విమర్శించారు. కేవలం రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, దీనికి కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టిమరల్చేందుకే వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు వెనకడుగు వేయరని అన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా విధానం మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నేత ఫిర్యాదుతో కదిలిన అధికార యంత్రాంగం


ద్వారకానగర్‌లో డ్రెయినేజీపై నిర్మించిన చప్టాలను తొలగిస్తున్న జేసీబీ

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్ (భీమడోలు జంక్షన్)లో డ్రెయినేజీ సమస్యపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి, భీమడోలు ఎంపీటీసీ సభ్యుడు ముళ్లగిరి జాన్సన్ చేసిన ఫిర్యాదుపై అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ క్రమంలో జేసీబీతో డ్రెయినేజీని శుభ్రం చేసారు. వివరాల్లోకి వెళితే.. ఉదయగిరి త్రినాథ్ అనే వ్యక్తి మురుగు కాలువను పూడ్చి బిల్డింగ్ నిర్మిస్తున్నారని, దీని కారణంగా జంక్షన్, స్టేట్ బ్యాంక్ వెనుక కాలనీలో ఇళ్లలోని మురుగు నీరు, వర్షపు నీరు దిగువ ప్రాంతానికి పారే వీలు ఉండదని గతనెల 23న జాన్సన్ పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు హుటాహుటీన జంక్షన్ నుంచి దిగువ ప్రాంతం వరకు పూడుకుపోయిన మురుగు కాలువలను శుభ్రం చేశారు. అందులో భాగంగా డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను జేసీబీ సహాయంతో తొలగించారు. అలాగే భవన నిర్మాణ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు చేపడుతున్నారని జాన్సన్ తెలిపారు. సమస్యపై స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

జంగారెడ్డిగూడెం: స్థానిక రాజా రాణి కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు కర్పూరం గురవయ్య గుప్త, ఓరుగంటి నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన గ్రామ కమిటీల పరిచయ కార్యక్రమం, అనంతరం సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జెట్టి గురునాథరావు, ఎంపీపీ కొదమ జ్యోతి, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి విష్ణు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి, మండల మాజీ అధ్యక్షుడు హరిబాబు, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. కావున మండల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

సంక్షేమ పెన్షన్లు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

లింగపాలెం: రాష్ట్రంలో సంక్షేమ పెన్షన్‌లు వెంటనే విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత సేవన డిమాండ్ చేసింది. మండలంలోని సింగగూడెంలో దళిత సేన జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జవరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పెన్షన్‌లు, వృద్ధాప్య పెన్షన్లు, డప్పు కళాకారుల పెన్షన్లు, చెప్పులు కుట్టే చర్మకారుల పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సంక్షేమ పెన్షన్‌లు విడుదల చేసే విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత సేన జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, ఏలూరు జిల్లా దళిత సేన వర్కింగ్ ప్రెసిడెంట్ సికాకొల్లు స్టాలిన్, లింగపాలెం మండల బీసీ సెల్ దళిత సేన అధ్యక్షుడు కొప్పుల నాగేందర్, చింతలపూడి పట్టణ దళిత సేన అధ్యక్షుడు మోనూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై అంగన్‌వాడీల నిరసన


చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు


కొయ్యలగూడెం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం


బుట్టాయగూడెం సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫోన్ సమస్యలు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒత్తిడి, సరుకుల పంపిణీలో అవాంతరాలపై నిరసన వ్యక్తం చేస్తూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. సుమారు నాలుగేళ్ల క్రితం అంగన్‌వాడీలకు అందజేసిన ఫోన్‌లలో తొంభై శాతం చెడిపోయాయని, యాప్‌లు ఉపయోగించడానికి అవసరమైన నెట్‌వర్క్ స్పీడ్ లేకపోవడంతో పాటు, మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్స్ అందుబాటులో లేకుండా ఉన్నాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ వంటివి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని అధికారులు ఒత్తిడి చేయడం వల్ల ప్రీ-స్కూల్ కార్యక్రమాలు దెబ్బతింటున్నాయని వారు ఆరోపించారు. గతంలో వలె లబ్ధిదారుల సంతకాలతో సరుకులు పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించాలని, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, అంగన్‌వాడీలకు ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) రద్దు చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి భారతి, ప్రాజెక్టు నాయకులు శివ రత్నకుమారి, పీఎల్‌ఎస్ కుమారి, నాగవేణి, సెక్టార్ నాయకులు సత్యవేణి, ధనలక్ష్మి, సీత, శ్రీదేవి పాల్గొన్నారు.

యాప్‌లను రద్దు చేయాలి

చింతలపూడి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఎన్ సరోజిని, జిల్లా నాయకురాలు టి మాణిక్యం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం అందించాలి గాని పోషణ ట్రాక్ యాప్, బాల సంజీవని యాప్ తీసుకొచ్చి లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్లకు దూరం చేసే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి సీడీపీఓకి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పాండురంగారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

బుట్టాయగూడెం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తమకు ప్రభుత్వం కేటాయించిన యాప్‌ల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్ని యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

చింతలపూడి: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ కె క్రాంతికుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఎస్సై కె సతీష్‌కుమార్‌తో కలిసి శక్తి యాప్ డౌన్లోడ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాలు, పోక్సో కేసులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నకిలీ ఫోన్ కాల్స్, ఎస్‌ఎంఎస్‌లు, మోసపూరిత లింకులు, ఓటీపీల వంటి నేరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి విద్యార్థులకు వివరించారు. మోసపూరిత కాల్స్, మెసేజ్ లు వచ్చినప్పుడు తప్పనిసరిగా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయసులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని, చక్కగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని హితవు చెప్పారు. ఎస్సై కె సతీష్ కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరగాళ్లు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు గాలం వేసే సంస్థలు ఎక్కువయ్యాయని అన్నారు. ఏటీఎం సెంటర్ లలో కార్డు క్లోనింగ్‌తో డేటా సేకరించి డబ్బు మాయం చేయడం, బ్యాంక్ నుంచి ఫోన్ చేసినట్టు నమ్మించి ఖాతా, ఏటీఎం కార్డు నెంబర్, పిన్ నెంబర్ తీసుకుని అకౌంట్ నుంచి డబ్బు మాయం చేసే ముఠాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ నెట్‌వర్క్, జీ మెయిల్‌లను అవసరం మేరకు వాడాలని, ఫొటోలు, వ్యక్తిగత సమాచారం పోస్ట్ చేయవద్దని చెప్పారు.